

# ఆయుష్మాన్‌భవ..

- గులాబీ అధినేత కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఆలయాలు, మసీదులు, చర్చిల్లో ప్రత్యేక పూజలు,ప్రార్థనలు
- శస్త్రచికిత్స విజయవంతం కావడంపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల్లో ఆనందం

**అభిమాన నేత ఆరోగ్యంగా ఉండాలని ప్రజల వేడుకోలు**

తెలంగాణ ఉద్యమ నాయకుడు, మాజీ సీఎం కేసీఆర్ నిండునూరేండ్లు చల్లగా ఉండాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారు. అభిమాన నాయకుడు, గులాబీ దళపతి కేసీఆర్ కోసం శనివారం ఉమ్మడి జిల్లాలోని బీఆర్ఎస్ నేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు ఆలయాలు, మసీదులు, చర్చిల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. హైదరాబాద్ యశోద దవాఖానలో శస్త్రచికిత్స విజయవంతం కావడంపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గులాబీ నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేశారు. కేసీఆర్ ఆరోగ్యం మెరుగుపడాలని, ఆయన త్వరగా కోలుకోవాలని కోరుతూ ఆయుష్మాన్‌భవ అంటూ దీవిస్తున్నారు.

– ఉమ్మడి జిల్లా నెట్‌వర్క్, డిసెంబర్ 9





గజ్వేల్‌లోని మహంకాళి అమ్మవారి ఆలయంలో పూజలో పాల్గొన్న వంటేరు ప్రతాప్‌రెడ్డి, నాయకులు



దుబ్బాక టౌన్: బాలాజీ దేవాలయంలో పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత, బీఆర్ఎస్ శ్రేణులు



శివ్వంపేట: సీతారామచంద్రస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



సిద్దిపేట వేంకటేశ్వరాలయంలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ యువజన, విద్యార్థి విభాగం నాయకులు



సిద్దిపేటరూరల్: చింతమడక పట్టాభిరాముడి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న సర్పంచ్, గ్రామస్తులు



హుస్నాబాద్‌టౌన్: హుస్నాబాద్‌లోని శ్రీదాస ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న తదితరులు



తొగుట మండలం రాంపూర్ స్వటిక లింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



గజ్వేల్‌లోని దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కొండపాక(కుకునూరుపల్లి): దుద్దెడలోని శంభుదేవుడి ఆలయంలో పూజలు చేస్తున్న డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి తదితరులు



మనోహరాబాద్ మండలం కాళ్లకల్ బంగారమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మెదక్ జడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలతాశేఖర్‌గౌడ్, బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు



నారాయణరావుపేట: బుగ్గరాజేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



నంగునూరు: కోనాయిపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# ఉచిత ప్రయాణం షురూ

- ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రారంభమైన మహాలక్ష్మి పథకం
- ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం
- ఎనిమిది డిపోల్లో 308 బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం
- గుర్తింపు కార్డు తప్పనిసరి, త్వరలో పూర్తిస్థాయి మార్గదర్శకాలు : ఆర్టీసీ ఆర్ఎం



సిద్దిపేటలో ఉచిత బస్సు ప్రయాణ సేవలను జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ పీజే పాటిల్



సంగారెడ్డిలో మహిళలతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న కలెక్టర్ శరత్

సంగారెడ్డి, డిసెంబర్ 9(నమస్తే తెలంగాణ)/ సంగారెడ్డి కలెక్టరేట్: ఉమ్మడి మెదక్ జిల్లాలో శనివారం మహాలక్ష్మి పథకం ప్రారంభమైంది. సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో కలెక్టర్లు మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం కింద ఆర్టీసీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు, బాలికలు, థర్డ్‌జెండర్ రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా టికెట్ లేకుండా ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. బస్సుల్లో ప్రయాణించే మహిళలు తప్పనిసరిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీచేసిన గుర్తింపు కార్డు చూపాల్సి ఉంటుంది. సంగారెడ్డిలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆవరణలో జిల్లా కలెక్టర్ శరత్ ఆర్టీసీ బస్సుల్లో మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించారు. ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సుల్లో బాలికలు, మహిళలకు జీరో ఫేర్ టికెట్‌ను అందజేశారు. జీరో టికెట్ అందుకున్న మహిళలు, బాలికలు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, ఆర్టీసీ ఆర్ఎం ప్రభులత పాల్గొన్నారు. మెదక్‌లో కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించారు. సిద్దిపేటలో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ ప్రారంభించారు.

### ఎనిమిది డిపోల ద్వారా...

మహాలక్ష్మి పథకం ద్వారా ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఎనిమిది డిపోల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించడం ప్రారంభమైంది. సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్, మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, గజ్వేల్–ప్రజ్ఞాపూర్, దుబ్బాక డిపోల్లో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు టికెట్ లేకుండా ఉచితంగా ప్రయాణించారు. అన్నిడిపోల పరిధిలో మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఎలాంటి టికెట్లు తీసుకోకుండా ప్రయాణం చేశారు. ఎనిమిది డిపోల పరిధిలో 308 బస్సుల్లో ఉమ్మడి మెదక్ జిల్లాలోని బాలికలు, మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారు. ఎనిమిది డిపోల పరిధిలోని 101 పల్లె వెలుగు బస్సులు, 207 ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు జీరో ఫేర్ టికెట్‌తో ఉచితంగా పయనించే సౌలభ్యం కల్పించారు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం అందుబాటులోకి రావడంతో మహిళలు, బాలికలు సంతోషం వ్యక్తం చేశారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలు, బాలికలు, థర్డ్‌జెండర్ తెలంగాణలో ఆర్టీసీ బస్సుల్లో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చు. రాష్ట్ర సరిహద్దులు దాటితే మాత్రం తప్పనిసరిగా టికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం వారం పాటు ఎలాంటి గుర్తింపు కార్డులు అడగమని, ఆ తర్వాత తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ ఆధార్ లేదా ఓటరు గుర్తింపు కార్డు చూపించి ప్రయాణించాల్సి ఉంటుందని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఎస్తేర్ ప్రభులత తెలిపారు.



మెదక్‌లో జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్, కలెక్టర్ రాజర్షి షా

ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఎనిమిది డిపోల పరిధిలో మహిళలు, బాలికలు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో పూర్తిగా ఉచితంగా ప్రయాణం చేయవచ్చని చెప్పారు.

## ఉచిత బస్సు సేవలను వినియోగించుకోవాలి

- కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్
- మహిళలతో కలిసి బస్సులో ప్రయాణం

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 9: మహిళలు ఉచిత బస్సు సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ కోరారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సేవలను సిద్దిపేట ప్రభుత్వ జనరల్ దవాఖాన ఆవరణలో జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకం కింద 18 ఏండ్లు నిండిన మహిళలు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా ప్రయాణం చేయవచ్చని చెప్పారు. సిద్దిపేట జిల్లాలో సుమారు 40 వేల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారని..అందుకు అనుగుణంగా ప్రయాణికులకు బస్సు సేవలు అందేలా ఏర్పాట్లు చేశామన్నారు. అంతకుముందు కలెక్టర్ బస్సులో జనరల్ దవాఖాన నుంచి పాత బస్టాండ్ వరకు ప్రయాణించారు. కార్యక్రమంలో సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

### మెదక్‌లో...

మెదక్ అర్బన్, డిసెంబర్ 9: మహిళలు ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. మెదక్ పట్టణంలో మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఉచిత బస్సు సౌకర్యాన్ని కలెక్టర్ రాజర్షి షాతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రతి మహిళ ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్టీసీ డిపో మేనేజర్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు వరం
# మహాలక్ష్మి పథకం

- రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం రూ.10 లక్షలకు పెంపు
- మెదక్‌లో కలెక్టర్ రాజర్షి షా
- పాల్గొన్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

మెదక్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మహిళలకు వరమని, మహిళలతో పాటు బాలికలు, విద్యార్థినులు, థర్డ్‌జెండర్లు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించవచ్చని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. శనివారం నుంచి మహాలక్ష్మి, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం రూ.10 లక్షలకు పెంపు పథకాలను మెదక్ జిల్లా కేంద్ర దవాఖానలో కలెక్టర్ రాజర్షి షాతో కలిసి ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరోగ్యశ్రీ పథకానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దవాఖానలో ఉన్న 108 వాహనాలను అత్యవసర సేవలకు మాత్రమే వినియోగించాలని వైద్యాధికారులకు సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ పథకంలో రూ. పది లక్షలకు పెంపు ద్వారా 1672 వ్యాధులకు చికిత్సను అన్ని స్పెషాలిటీ, మల్టీ స్పెషాలిటీ దవాఖానల్లో ఉచిత వైద్యం అందుబాటులో ఉంటుందన్నారు. ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని మహిళలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి చందు నాయక్, జిల్లా కేంద్ర దవాఖాన సూపరింటెండెంట్ పి.చంద్రశేఖర్, మెప్మా పీడీ ఇందిర, ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, ఆర్టీసీ డీఎం సుధ, మెదక్ తహసీల్దార్ శ్రీనివాస్, మహిళలు, ప్రజాప్రతినిధులు, మహిళా అధికారులు పాల్గొన్నారు.



మెదక్‌లో ఆరోగ్యశ్రీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, కలెక్టర్ రాజర్షి షా